ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

తమిళనాడు
TAMILNADU

శుక్రవారం 5 జనవరి 2024



ఐదు రోజులపాటు తేలికపాటి వర్షాలు



ఊటీ ఘాట్‌రోడ్డులో హెడ్‌లైట్లు వేసుకుని వెళుతున్న వాహన చోదకులు

అడయార్,జనవరి4:రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లోనూ, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతంలో శుక్ర, శనివారాల్లో తేలికపాటి వర్షపు జల్లులు పడే అవకాశం ఉందని చెన్నై వాతావరణ కేంద్రం తెలిపింది. ముఖ్యంగా తేని, దిండిగల్, నీలగిరి జిల్లాల్లో వర్షం పడుతుందని ప్రకటించింది. కాగా ఈనెల 6న కోస్తాతీర జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కన్నియాకుమారి, తిరునెల్వేలి, తెన్‌కాశి, విరుదునగర్, పుదుక్కోట, తంజావూరు, తిరువారూరు, నాగపట్టణం, మైలాడుదురై జిల్లాల్లోను, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అదేవిధంగా ఈ నెల 7, 8 తేదీల్లో తిరువళ్ళూరు, చెన్నై, కాంచీపురం జిల్లాల్లో భారీ వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఇదిలా వుండగా గురువారం వర్షం చెన్నైని తడిపేసింది.

ఊటీ, కున్నూరు ప్రాంతాలను కప్పేసిన మంచు

ప్రముఖ పర్యాటక ప్రాంతాలు ఊటీ, కున్నూరు, గూడలూరు ప్రాంతాల్లో గురువారం వేకువజాము దట్టమైన మంచు అలముకుంది. జననివాస ప్రాంతాలు, తేయాకు తోటలు, పండ్ల తోటలు, పూల తోటలను మంచు దట్టంగా కప్పేసింది. ఈ మూడు ప్రాంతాల్లోనూ రహదారులు తెలియనంతగా దట్టమైన మంచు కురిసింది. దీనితో వాహన చోదకులు దారి తెలియక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఊటీ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న వారంతా తీవ్రమైన చలితో వణికిపోతున్నారు.



ప్రధానికి ఆహ్వాన పత్రికను అందిస్తున్న ఉదయనిధి

ప్రధానితో మంత్రి ఉదయనిధి భేటీ

'ఖేలో ఇండియా' పోటీలకు ఆహ్వానం

చెన్నై,జనవరి4(ఆంధ్రజ్యోతి): మంత్రి ఉదయనిధి స్టాలిన్ గురువారం మధ్యాహ్నం ప్రధాని నరేంద్రమోదీతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో 'ఖేలో ఇండియా' పోటీలు జరగనుండడంతో ఆ పోటీల ముగింపు ఉత్సవాలకు రావాలని ప్రధాని మోదీని ఆహ్వానించేందుకు ఉదయనిధి బుధవారం సాయంత్రం ఢిల్లీకి వెళ్లిన విషయం తెలిసిందే. గురువారం మధ్యాహ్నం ప్రధాని మోదీని ఆయన నివాసగృహంలో కలుసుకున్నారు. ఆ సందర్భంగా మోదీకి ఆయన పుష్పగుచ్ఛం అందజేశారు. ఆ తర్వాత ఖేలో ఇండియా క్రీడాపోటీలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా మోదీ ఉదయనిధితో కాసేపు ఆప్యాయంగా మాట్లాడారు. ఖేలో ఇండియా పోటీల నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. వీలైతే పోటీల ముగింపు సభకు వస్తానని ప్రధాని మోదీ చెప్పినట్లు సమాచారం.

సోనియా, రాహుల్‌కు ఆహ్వానం..

మంత్రి ఉదయనిధి స్టాలిన్ కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీతోనూ భేటీ అయ్యారు. వారికీ ఖేలో ఇండియా పోటీల ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా ముగ్గురూ పావుగంటకు పైగా చర్చించుకున్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ఆయన కుటుంబీకుల బాగోగులు గురించి సోనియా, రాహుల్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేంద్ర క్రీడా శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్‌తోనూ భేటీ అయిన ఉదయనిధి.. ఆయనకూ ఆహ్వానపత్రికను అందజేశారు. ఇదిలా వుండగా ఈ వరుస భేటీల గురించి ఉదయనిధి మీడియాతో మాట్లాడుతూ.. ఈ భేటీకి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని, ఖేలో ఇండియా పోటీలకు ఆహ్వానించేందుకే తాను వచ్చానని వివరించారు.

రాష్ట్రానికి అదనపు నిధులు అందజేశాం

- రాష్ట్రాలకు పన్నుల వాటాలో పక్షపాతం లేదు
- సందేహాలు నివృత్తి చేసేందుకు ఎప్పుడూ సిద్ధమే
- కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్



సమావేశంలో ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్

పెరంబూర్, జనవరి 4: పన్నుల వాటాకు సంబంధించి ఎలాంటి వివక్ష చూపడం లేదని, అన్ని రాష్ట్రాలకు సమానంగా అందజేస్తున్నామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసేలా 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'ను చేపట్టారు. ఆ క్రమంలో స్థానిక వెస్ట్ మాంబళంలో గురువారం 'మన లక్ష్యం అభివృద్ధి భారతం' అనే పేరుతో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ... తమిళనాడుకు కేంద్రప్రభుత్వం ఏమీ ఇవ్వడం లేదని మాట్లాడుతున్నారని, కానీ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అన్నివిధాలా సహకరిస్తోందన్నారు. నాలుగు వందే భారత్ రైళ్లు తమిళనాడులోనే నడుస్తున్నాయని తెలిపారు. 2014-2023 వరకు తమిళనాడు నుంచి కేంద్రప్రభుత్వానికి పన్నుల రూపంలో రూ.6.23 లక్షల కోట్లు అందగా, రాష్ట్రప్రభుత్వానికి కేంద్రప్రభుత్వం అందించిన నిధులు రూ.6.96 లక్షల కోట్లుగా ఉన్నాయన్నారు. ఆ ప్రకారం, రాష్ట్రం నుంచి పన్నుల రూపంలో సేకరించిన నిధుల కన్నా అధికంగానే అందజేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం సెస్ పన్ను వసూలుచేస్తూ తమిళనాడుకు ఇవ్వడం లేదని మాట్లాడుతున్నారని, సెస్ పన్నుతో పాఠశాల భవన నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. జీఎస్‌టీ పన్ను పూర్తిగా రాష్ట్రాలకే అందజేస్తున్నామని తెలిపారు. ఎస్‌జీఎస్‌టీ అనే స్టేట్ జీఎస్‌టీ పన్ను 100 శాతం రాష్ట్రాలకే వెళుతోందన్నారు. ఐజీఎస్‌టీలో 50 శాతం రాష్ట్రాలకే అందిస్తున్నామన్నారు. పన్నుల నుంచి రాష్ట్రాలకు ఎంత నిధులు కేటాయించాలనేది ఫైనాన్స్ కమిషన్ నిర్ణయిస్తుందన్నారు. దీపావళి, సంక్రాంతి తదితర పండుగలను పరిగణలోకి తీసుకొని నెల ముందుగానే నిధులు అందజేయడం జరుగుతుందన్నారు. పన్ను కేటాయింపులపై అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.

బోట్‌క్లబ్‌లో చదరపుటడుగు ధర రూ.28,500

- తాంబరంలో రూ.6 వేలు
- చెన్నైలో స్థలాల విలువల జాబితా విడుదల

చెన్నై, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): చెన్నైలో స్థలాల విలువలు విపరీతంగా పెరుగుతున్నాయి. గతంలో సబర్బన్ ప్రాంతాల్లో స్థలాల ధరలు తక్కువగా ఉండేవి. ఆ ప్రాంతాల్లో మధ్యతరగతి కుటుంబీకులు ఇళ్లను నిర్మించుకునేవారు. ప్రస్తుతం నగరంలోనూ, సబర్బన్ ప్రాంతాల్లోనూ ఆకాశహర్మ్యాలు పుట్టుకువచ్చాయి. పది నుంచి 20 అంతస్థుల దాకా భవనసముదాయాలు నిర్మితమవుతున్నాయి. దీంతో నగరంలో స్థలాల విలువలు కూడా విపరీతంగా పెరిగాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శక (గైడ్‌లైన్) ఉజ్జాయింపు ధరల వివరాలను ఓ ప్రకటనలో వెల్లడించింది. ఆ వివరాల ప్రకారం అడయార్ బోట్ క్లబ్ ప్రాంతంలోని స్థలం విలువను అత్యధికంగా నిర్ణయించారు. ఆ ప్రాంతం వద్ద చదరపుటడుగు స్థలం విలువ రూ.28500 అని, తాంబరం ప్రాంతంలో చదరపుటడుగు స్థలం విలువ రూ.3800 నుంచి రూ.6000గా తెలిపింది. మైలాపూరు సెయింట్ మేరీస్ రోడ్డులో చదరపుటడుగు స్థలం విలువ రూ.15వేలుగా, నార్త్ చెన్నై ముత్యాలపేట తంబుశెట్టి వీధి నుండి ముక్కర్ నల్లముత్తు వీధి వరకు ఉన్న ప్రాంతంలో చదరపుటడుగు స్థలం విలువ రూ.16,500గా నిర్ణయించారు. ఇదే విధంగా టి.నగర్ బజుల్లారోడ్డు ప్రాంతంలో చదరపుటడుగు స్థలం విలువ రూ.16,500లుగా పేర్కొన్నారు.



సమావేశం ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

రూ.5.50 లక్షల కోట్ల పెట్టుబడుల సమీకరణ

- 7, 8 తేదీల్లో చెన్నై సదస్సుకు ఏర్పాట్లు

ప్యారీస్, జనవరి 4: నగరంలో ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహించనున్న అంతర్జాతీయ పెట్టుబడిదారుల మహానాడులో రూ.5.50 లక్షల కోట్ల పెట్టుబడులు సమీకరించేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ సమావేశాలను విజయవంతం చేసేలా ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు నెలకొల్పి భారీస్థాయిలో పెట్టుబడులు సమీకరించేందుకు అనుకూలంగా ముఖ్యమంత్రి స్టాలిన్ గతంలో పలు విదేశాల్లో పర్యటించి, వాణిజ్యపరమైన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. దీని ద్వారా పలు విదేశీ సంస్థలు తమిళనాడులో పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకొచ్చాయి. ఈ నేపథ్యంలో, స్థానిక నందంబాక్కంలో ఉన్న చెన్నై ట్రేడ్ సెంటర్‌లో ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహించనున్న అంతర్జాతీయ పెట్టుబడిదారుల సమావేశంలో అమెరికా, ఇంగ్లాండ్, జర్మనీ, ఫ్రాన్స్, జపాన్ తదితర దేశాల నుంచి పెట్టుబడిదారులు పాల్గొననున్నారు. ఈ సమావేశంలో పరిశ్రమలకు సంబంధించిన అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేయనున్నారు. ఈ సదస్సు కోసం చేపట్టిన ఏర్పాట్లు, విదేశీ ప్రతినిధులను ఆహ్వానించడం, వారికి కల్పించనున్న బస వసతి, రవాణా సదుపాయాలు తదితర అంశాలపై ముఖ్యమంత్రి స్టాలిన్ అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్బీ రాజా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, పరిశ్రమల శాఖ కార్యదర్శి అరుణ్‌రాయ్ సహా పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రూ.145.94 కోట్లతో మత్స్యశాఖ భవనాలు

- ప్రారంభించిన సీఎం స్టాలిన్

చెన్నై, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మత్స్యకారుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూ.145.94 కోట్ల వ్యయంతో నిర్మించిన కొత్త భవనాలను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గురువారం ఉదయం ప్రారంభించారు. సచివాలయంలో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో రూ. 134.29 కోట్ల వ్యయంతో 6 కొత్త చేపల దిగుమతి కేంద్రాలు, మరమ్మతు పనులతో కొత్త రూపు సంతరించుకున్న 4 చేపల దిగుమతి కేంద్రాలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ప్రారంభించారు. ఇదే విధంగా తమిళనాడు డాక్టర్ జె.జయలలిత మత్స్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రూ.11.65 కోట్ల వ్యయంతో నిర్మించిన భవనాలను కూడా ప్రారంభించారు. రామనాథపురం జిల్లా మండపం నార్త్ ప్రాంతంలో మరమ్మతు చేసిన చేపలు దించే కేంద్రం, తంగచ్చిమఠం వద్ద నిర్మించిన చేపల దించే కేంద్రం, కన్నియాకుమారి జిల్లా కీళమణకుడిలో మరో కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఇక చెంగల్పట్టు జిల్లా పాతనడుకుప్పం, కొత్త నడుకుప్పం ప్రాంతాల్లో, కడలూరు జిల్లా తాళంకుడా గ్రామంలో, తూత్తుకుడి జిల్లా కీళ్‌వైప్పార్‌లో, వానగిరిలో చేపలు దించే కేంద్రాలను ప్రారంభించారు. ఇదే విధంగా తమిళనాడు డాక్టర్ జె.జయలలిత మత్స్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని తూత్తుకుడి మత్స్య కళాశాల పరిశోధన కేంద్రం విద్యార్థుల కోసం రెండంతస్థుల భవన సముదాయాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రారంభించారు. నాగపట్టినం తలైజ్ఞాయిరు డాక్టర్ ఎంజీఆర్ మత్స్య కళాశాల పరిశోధన సంస్థలో పరిపాలనా భవనాన్ని కూడా స్టాలిన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామో అన్బరసన్, అనితా రాధాకృష్ణన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, పశుసంవర్థకశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి మంగత్‌రామ్ శర్మ, మత్స్య శాఖ కమిషనర్ డాక్టర్ కేఎస్ పళనిస్వామి, మత్స్యాభివృద్ధి సంస్థ అధ్యక్షుడు ఎన్.గౌతమన్, తమిళనాడు డాక్టర్ జె.జయలలిత మత్స్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఎన్. ఫెలిక్స్ తదితరులు పాల్గొన్నారు.

తాంబరంలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్...

సచివాలయంలో ఏర్పాటైన మరొక కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చెంగల్పట్టు జిల్లా తాంబరం శానిటోరియం హోమ్ రోడ్డులో నిర్మించిన వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ భవనాన్ని కూడా ఎంకే స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. తాంబరంలోని హాస్టల్ భవనం వద్ద జరిగిన కార్యక్రమంలో శాసనసభ్యులు ఎస్ఆర్ రాజా, ఇ.కరుణానిధి, చెంగల్పట్టు జిల్లా కలెక్టర్ రాహుల్‌నాథ్, తాంబరం కార్పొరేషన్ కమిషనర్ అళగుమీనా తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరినార పరిశ్రమలకు నూతన విధానం

సచివాలయంలో ఏర్పాటైన మరో కార్యక్రమంలో కొబ్బరినార పరిశ్రమలకు సంబంధించిన నూతన విధానాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విడుదల చేశారు. రాష్ట్రంలో కొబ్బరి నార పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా ఈ నూతన విధానాన్ని రూపొందించినట్లు ఆయన తెలిపారు. గురువారం ఉదయం జరిగిన కార్యక్రమంలో 'కొబ్బరినార పరిశ్రమల నూతన విధానం 2024' పేరుతో ముద్రించిన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఎంఎస్ఎంఈ సంస్థల శాఖ కార్యదర్శి అర్చనా పట్నాయక్, రాష్ట్ర నార వాణిజ్య అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎల్.నిర్మల్‌రాజ్ పాల్గొన్నారు.

కార్మికులు సమ్మెకు దిగినా బస్సులు నడుపుతాం

- రవాణాశాఖ మంత్రి శివశంకర్

చెన్నై, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రవాణా కార్మికులు సమ్మె చేపట్టినా బస్సులను నడిపితీరుతామని రవాణాశాఖ మంత్రి శివశంకర్ ప్రకటించారు. 15వ వేతన సంఘం సిఫారసుల ప్రకారం వేతనాలు పెంచాలని, ఇతర సదుపాయాలను కల్పించాలని కోరుతూ ప్రభుత్వ రవాణా సంస్థలలో పనిచేస్తున్న కార్మికులు కొద్ది మాసాలుగా డిమాండ్ చేస్తున్నారు. కార్మికులకు చెల్లించాల్సిన డీఏ బకాయిలు కూడా సంక్రాంతి లోపున చెల్లించాలని కూడా కోరుతున్నారు. ఈ అంశాలపై కార్మికుల సంక్షేమ శాఖ డిప్యూటీ కమిషనర్ అధ్యక్షతన రెండుసార్లు జరిగిన త్రైపాక్షిక చర్చలు విఫలమయ్యాయి. బుధవారం జరిగిన చర్చలలో పింఛన్‌దారులకు చెల్లించాల్సి డీఏ బకాయిలను సంక్రాంతిలోపు చెల్లించాలని కార్మిక సంఘాల నేతల పట్టుబట్టారు. కానీ ఆ డిమాండ్ గురించి ప్రభుత్వ పరంగా ఎలాంటి స్పందన రాలేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 9 నుండి నిరవధిక సమ్మెకు దిగనున్నట్లు కార్మిక సంఘాలు నేతలు సంయుక్తంగా ప్రకటించారు. పండుగ సమయంలో ఇలా రవాణా కార్మికులు సమ్మెకు దిగితే తీవ్ర ఇబ్బందులు కలుగుతాయని ప్రజానీకం ఆందోళన చెందుతోంది. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి శివశంకర్ మాట్లాడుతూ... రవాణా కార్మికుల డిమాండ్‌లను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగానే ఉందని, కాకపోతే సంక్రాంతి తర్వాత చర్చలు జరిపి పరిష్కరించుకోవాలని తాను చేసిన ప్రతిపాదనను కార్మిక సంఘాల నేతలు తోసిపుచ్చారని ఆరోపించారు. సాధ్యమైనంతవరకూ సమ్మెను అడ్డుకునేందుకు ప్రభుత్వపరంగా కార్మిక సంఘాలతో సంప్రదింపులు జరుపుతామన్నారు. అన్నాడీఎంకేకు చెందిన కార్మిక సంఘం సహా కొన్ని సంఘాలు సంక్రాంతి లోపునే అన్ని డిమాండ్‌లు పరిష్కరించాలని పట్టుబట్టాయన్నారు. రవాణా శాఖ పింఛన్‌దారులకు ఎనిమిదేళ్లుగా డీఏ బకాయిలు చెల్లించలేదన్న ఆరోపణ సరికాదని, అన్నాడీఎంకే ప్రభుత్వ హాయంలో ఐదేళ్లపాటు డీఏ చెల్లించలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో రవాణా కార్మికుల వేతనాల హెచ్చింపులో అవకతవకలు జరిగాయని, సీనియారిటీని పట్టించుకోలేదన్నారు. ఏదీ ఏమైనప్పటికీ రవాణా కార్మికులు సమ్మెకు దిగినా ప్రజలకు ఇబ్బంది కలుగకుండా బస్సులు నడిపే దిశగా చర్యలు చేపడుతున్నామని మంత్రి శివశంకర్ చెప్పారు.

మంత్రి తుమ్మలను కలిసిన తమిళనాడు రైతు

తమ రాష్ట్రానికి రావాలని ఆహ్వానం



మంత్రి తుమ్మలను కలిసిన తమిళనాడు రైతు కుప్పుస్వామి

ఖమ్మం/సత్తుపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : నూనె ఉత్పత్తులతో సేంద్రియ ఎరువులను తయారుచేసి.. అధిక దిగుబడులు సాధిస్తున్న తమిళనాడు రైతు కుప్పుస్వామి గురువారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం పాకాలగూడెంలో రాష్ట్రవ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. తమిళనాడులో తాను సేంద్రియ ఎరువులతో సాగు చేస్తున్న పంటలను పరిశీలించేందుకు రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా కుప్పుస్వామి మాట్లాడుతూ తెలంగాణలో ఒక ఆదర్శ రైతు వ్యవసాయశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్నారన్న విషయం తెలుసుకుని తాను రాష్ట్ర ఉద్యానశాఖ మాజీ కమిషనర్ వెంకటరామిరెడ్డి సాయంతో ఇక్కడకు వచ్చానని, అది కూడా ఆయన తన వ్యవసాయక్షేత్రంలో ఉండగా కలవడం సంతోషంగా ఉందన్నారు. తాను సంగారెడ్డిలో 25 ఎకరాల వ్యవసాయక్షేత్రాన్ని కౌలుకు తీసుకుని మొదట్లో రసాయనిక ఎరువులు వాడి నష్టపోయానని, తర్వాత నూనెగింజలను గానుగ ఆడించడం ద్వారా వచ్చిన నూనెలతో పాటు ఆయిల్ తీసిన తర్వాత వచ్చే పిప్పిని కలిపి సేంద్రియ ఎరువులను తయారు చేశానని, తద్వారా అధిక దిగబుడులు సాధించానని వివరించారు. సేంద్రియ ఎరువుల వాడకంతో భూసారం పెరుగుతుందని, తాను ఉద్యానపంటలతోపాటు పలు పంటలను సాగుచేస్తున్నానని కుప్పుస్వామి తుమ్మలకు వివరించారు. తమిళనాడు వచ్చి తాను చేస్తున్న సేంద్రియ పంటల సాగును, నూనె, వాటి ఉప ఉత్పత్తులతో సేంద్రియ ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలించాలని తుమ్మలను కోరారు. ఈ క్రమంలో సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు సాధిస్తున్న కుప్పుస్వామిని మంత్రి తుమ్మల అభినందించారు.

ఎంపీ గౌతం శిఖామణిపై అభియోగాల నమోదు వాయిదా

అడయార్, జనవరి 4: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు నమోదు చేసిన ఫెరా ఉల్లంఘన కేసులో కళ్ళకుర్చి ఎంపీ, మాజీ మంత్రి పొన్ముడి కుమారుడు గౌతం శిఖామణి గురువారం కోర్టుకు హాజరుకాలేదు. దీంతో ఆయనపై అభియోగాల నమోదును ఈ నెల 24వ తేదీకి వాయిదా వేశారు. విల్లుపురం జిల్లాలో ప్రభుత్వ అనుమతులకు మించి ఎర్రమట్టి తవ్వకాలు జరిపి ప్రభుత్వ ఖజానాకు రూ.28.36 కోట్ల నష్టం చేకూర్చారన్న కేసులో మాజీ మంత్రి పొన్ముడిని మద్రాస్ హైకోర్టు దోషిగా తేల్చింది. ఈ కేసులు ఆధారంగా చేసుకుని పొన్ముడి కుమారుడు గౌతం శిఖామణితో పాటు మరికొందరు ఇళ్ళలో తనిఖీలు చేసి కీలక దస్తావేజులతో పాటు విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. పైగా ఫెరా చట్ట నిబంధనలు ఉల్లంఘించి విదేశాల్లో పెట్టుబడులు పెట్టినట్టు గుర్తించారు. దీంతో ఆయనకు చెందిన బ్యాంకు డిపాజిట్లతో పాటు కొంత నగదును కూడా ఈడీ స్వాధీనం చేసుకుంది. ఈ కేసు విచారణ మద్రాస్ హైకోర్టులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో సాగుతుండగా, గురువారం న్యాయమూర్తి మలర్‌వాణన్ సమక్షంలో విచారణకు రాగా, గౌతం శిఖామణి మినహా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారంతా హాజరయ్యారు. గౌతం శిఖామణి హాజరుకాకపోవడంతో వారిపై అభియోగాల నమోదును ఈ నెల 24వ తేదీకి వాయిదా వేశారు.

సమాచార దర్శిని

నేడు సహకార బ్యాంక్ ఉద్యోగుల ఆందోళన

ఐసిఎఫ్, జనవరి 4: సహకార బ్యాంక్ ఉద్యోగులు శుక్రవారం ఆందోళన చేపట్టనున్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులకు 15 శాతం వేతన పెంపు ఇటీవల ప్రకటించారు. అయితే ఈ పెంపు 20 శాతం ప్రకటించాలని కోరుతూ శుక్రవారం, 10,23,24 తేదీల్లో దశలవారీ ఆందోళనలు చేపట్టనున్నట్లు సహకార బ్యాంక్ ఉద్యోగుల సమ్మేళనం అధ్యక్షుడు తమిళరసు ఒక ప్రకటనలో తెలిపారు.

జల్లికట్టు ఎద్దులకు అర్హత సర్టిఫికెట్లు

ఐసిఎఫ్, జనవరి 4: సంక్రాంతి సందర్భంగా జరిగే జల్లికట్టు పోటీల్లో పాల్గొనే ఎద్దులకు వైద్య శిబిరం నిర్వహించి అర్హత సర్టిఫికెట్లు అందజేశారు. తిరుప్పరంకుండ్రం సమీపంలోని విళేచ్చేరిలో ఉన్న వెటర్నరీ ఆసుపత్రి ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరంలో, ఎద్దుల కొమ్ముల పొడవు, వయసు, పళ్ల సంఖ్య, మోపురం వంటి వాటిని పరీక్షించి అర్హత సర్టిఫికెట్లు అందజేశారు.

9న సైన్యానికి మహిళల ఎంపిక

ఐసిఎఫ్, జనవరి 4: అగ్నివీర్ పథకం కింద సైన్యానికి మహిళలను చేర్చేలా కడలూరు అన్నా మైదానంలో ఈ నెల 9వ తేది ఆన్‌లైన్ రాతపరీక్ష జరుగనుంది. హాల్‌టికెట్లు పొందిన వారు సర్టిఫికెట్లు, ఇతర ఆధార పత్రాలతో పరీక్షకు హాజరుకావాలి. ఇతర వివరాలకు ఇండియన్ ఆర్మీవెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

బీఎడ్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జనవరి 4: బీఎడ్ కోర్సులో చేరేందుకు ఈ నెల 20వలోపు దరఖాస్తు చేసుకోవాలని తమిళనాడు సార్వత్రిక విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ సెందిల్‌కుమార్ తెలిపారు. మరిన్ని వివరాలకు 044-24306617 నెంబరు సంప్రదించవచ్చు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, జనవరి 4: ఎగ్మూర్, ఆవడి, పెరంబూర్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 11 గంటలకు విద్యుత్ గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు విద్యుత్ బోర్డు తెలిపింది. ఒట్టేరి పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఉప విద్యుత్ కేంద్ర కార్యాలయంలో ఎగ్మూర్ పరిధికి చెందిన వారు, ఆవడి ఇంజనీర్ కార్యాలయంలో ఆ ప్రాంత పరిధికి చెందిన వారు, సెంబియం ఉప విద్యుత్ కేంద్రంలో పెరంబూర్ పరిధికి చెందిన వారు పాల్గొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని విద్యుత్ బోర్డు తెలియజేసింది.

15నుంచి మదురై జల్లికట్టు పోటీలు

పెరంబూర్, జనవరి 4: సంక్రాంతి పండుగ సందర్భంగా మదురై జిల్లాలో జరిగే జల్లికట్టు పోటీల తేదీలను ప్రకటించారు. అవనియాపురంలో ఈ నెల 15వ తేది, పాలమేడులో 16న, అలంగానల్లూర్‌లో 17వ తేది జల్లికట్టు పోటీలు నిర్వహించనున్నారు. ఆయా ప్రాంతాల్లోని మైదానాల్లోనే జల్లికట్టు పోటీలు జరుగుతాయని కలెక్టర్ సంగీత ప్రకటించారు. రాష్ట్రంలో ఈ ఏడాది తొలి జల్లికట్టు పోటీలు ఈనెల 6వ తేది పుదుకోట జిల్లా తచ్చంకుర్చిలో జరగనున్న విషయం తెలిసిందే.

కోయంబేడులో కిలో వెల్లుల్లి రూ.340

ప్యారీస్, జనవరి 4: స్థానిక కోయంబేడు కూరగాయల మార్కెట్లో గురువారం కిలో వెల్లుల్లి ధర రూ.340కి పలికింది. టమోటా, చిన్న ఉల్లి, బంగాళాదుంపల ధరల్లో ఎలాంటి మార్పు లేదు. టమోటా కిలో రూ.25, ఉల్లి రూ.30, బంగాళాదుంపలు రూ.25కు విక్రయించారు. పొట్లకాయ, కాకరకాయ, సొరకాయ ధరలు రూ.5 తగ్గించి కిలో రూ.30కి, పచ్చి మిర్చి రూ.35, మునక్కాయలు రూ.110కి విక్రయించినట్లు వ్యాపారులు తెలిపారు.

8 నుంచి స్వచ్ఛభారత్

పెరంబూర్, జనవరి 4: ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 8 నుంచి 10వ తేది వరకు స్వచ్ఛభారత్ చేపట్టనున్నారు. ఈ మేరకు పాఠశాల విద్య కమిషనర్ జారీచేసిన ఉత్తర్వుల్లో పాఠశాలలు శుభ్రంగా ఉంచేలా 'మా పాఠశాల... మెరిసే పాఠశాల' పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు.

కిలంబాక్కంలో పోలీస్‌స్టేషన్

ప్యారీస్, జనవరి 4: కిలంబాక్కం కొత్త బస్ టెర్మినల్ ప్రాంగణంలో రూ.6.55 కోట్లతో పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి నిధులు కేటాయించిన రాష్ట్రప్రభుత్వం, జీవో కూడా గురువారం విడుదల చేసింది. రాజధాని నగరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రించే దిశగా వండలూరు సమీపంలో ఉన్న కిలంబాక్కంలో కొత్తగా నిర్మించిన బస్ టెర్మినల్‌ను ముఖ్యమంత్రి స్టాలిన్ గత నెల 30వ తేది ప్రారంభించారు. ఈ బస్ టెర్మినల్‌లో షిఫ్టు విధానంలో 120 మంది పోలీసులు భద్రతా విధుల్లో పాల్గొంటున్నారు. వీరి కోసం రూ.6.55 కోట్ల వ్యయంతో పోలీస్‌స్టేషన్ నిర్మించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ హోంశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి అముద పేర్కొన్నారు. ఐదుగురు ఇన్స్‌పెక్టర్లు, 8 మంది ఎస్‌ఐలు, 10 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 55 మంది గ్రేడ్-1 కానిస్టేబుళ్లు విధుల్లో పాల్గొంటారని తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్టు

అడయార్, జనవరి 4:సెంట్ థామస్ మౌంట్‌లో నిషేధిత గంజాయిని విక్రయిస్తున్న యువకుడిని ఎక్సైజ్ శాఖ పోలీసులు అరెస్టు చేశారు. నీలగిరి జిల్లా పందలూరు ప్రాంతానికి చెందిన యోగేశ్వరన్ (24) ఇతర ప్రాంతాల నుంచి గంజాయి అక్రమంగా తీసుకొచ్చి నగరంలోని చూలైమేడు తదితర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్టు విచారణలో అంగీకరించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి


అరుణ్‌కుమార్, ప్రవీణ్ (ఫైల్)

చెన్నై, జనవరి4 (ఆంధ్రజ్యోతి): తిరుపత్తూరు సమీపంలో గురువారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. తిరుపత్తూరు జిల్లా నిమ్మియంపట్టు గ్రామానికి చెందిన ప్రవీణ్ (27), అరుణ్‌కుమార్(24)స్నేహితులు. ఇరువురూ తిరుపత్తూరులో యోగా శిక్షణ పొందుతున్నారు. రోజూ బైకులో యోగా కేంద్రానికి వెళుతుంటారు. గురువారం ఉదయం ఇరువురూ బైకులో యోగా కేంద్రానికి బయలుదేరివెళ్లారు. ఆ బైకు కావాపట్టరై వద్ద వెళుతుండగా రాష్ట్ర రవాణా సంస్థ బస్సు ఢీకొంది. ఇరు వురూ ఆ స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు అక్కడికి వెళ్లి ఇరువురి మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పరువు నష్టం దావా కేసులో కోర్టుకు హాజరైన మాజీ మంత్రి

అడయార్, జనవరి 4: డీఎంకే ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు దాఖలైన పరువునష్టం దావా కేసులో మాజీ మంత్రి సీవీ షణ్ముగం గురువారం విల్లుపురం కోర్టులో హాజరయ్యారు. గతంలో విల్లుపురం పాత బస్టాండు సమీపంలో జరిగిన ఒక బహిరంగ సభలో సీవీ షణ్ముగం పాల్గొని సీఎంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అలాగే, డీఎంకే ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు కూడా చేశారు. దీంతో ఆయనపై నాలుగు పరువునష్టం దావా కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల విచారణ వివిధ కోర్టుల్లో సాగుతోంది. ఈ నేపథ్యంలో గురువారం విల్లుపురం జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు-1 (జేఎం కోర్టు-1)లో విచారణకు రాగా మాజీ మంత్రి హాజరయ్యారు. ఆ తర్వాత ఈ కేసు తదుపరి విచారణను ఈ నెల 23వ తేదీకి వాయిదా వేశారు.

రిజిస్ట్రేషన్ ఫీజుల పెంపు ఉపసంహరించాలి

● కట్టడ నిర్మాణ సంస్థల సంఘం డిమాండ్



విలేఖరుల సమావేశంలో ప్రసంగిస్తున్న క్రెడాయ్ నేషనల్ సౌత్‌జోన్ ఉపాధ్యక్షుడు ఎస్. శ్రీధరన్ తదితరులు

చెన్నై, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అటు కొనుగోలుదారులకు ఇటు అమ్మకందారులైన కట్టడ నిర్మాణ సంస్థలకు తీవ్ర నష్టం కలిగించే రీతిలో విపరీతంగా పెంచిన రిజిస్ట్రేషన్ ఫీజులను ఉపసహంచరించుకోవాలని నగరంలోని ప్రముఖ కట్టడ నిర్మాణ సంస్థల నిర్వాహకులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారుల సంఘం నిర్వాహకులు డిమాండ్ చేశారు. నగరంలో గురువారం ఉదయం ఏర్పాటైన విలేఖరుల సమావేశంలో క్రెడాయ్ నేషనల్ సౌత్‌జోన్ ఉపాధ్యక్షుడు ఎస్. శ్రీధరన్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం వెలువరించిన ఉత్తర్వు 131 ప్రకారం తక్కువ ధరకు స్థలాలు లభించే ప్రాంతాల్లో నిర్దేశిత ధరకంటే అధికమైన ధరలతో స్థలాలను విక్రయించాలని నిర్బంధపరిచే రీతిలో ఉందన్నారు. స్థలం, భవనం రెండింటినీ చేర్చి మొత్తం విలువను పరిగణనలోకి తీసుకుని రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని చెప్పడం గర్హనీయమన్నారు. ఈ విషయమై సీఎండీఏ మంత్రితో పలు మార్లు చర్చలు జరిపామని, వీలయినంత త్వరగా తగు చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారని, అయితే అధికారులే ప్రభుత్వానికి ఆదాయ వనరులను పెంచేందుకు రిజిస్ట్రేషన్ ఫీజును విపరీతంగా పెంచాల్సిందేనంటూ పట్టుబడుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో క్రెడాయ్ చెన్నై అధ్యక్షులు ఎస్. శివగురునాధన్, రాష్ట్ర విభాగం అధ్యక్షుడు ఆర్ ఇళంగోవన్, బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నిర్వాహకులు ఎల్.శాంతకుమార్, అంబత్తూరు - ఆవడి ప్లాట్ ప్రమోటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేకే తిరుమాళై, చెన్నై ఫ్లాట్ ప్రమోటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డి. క్రిస్టిన్‌పాల్, చెన్నై సదరన్ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. మోహన్, చెన్నై సౌత్ ప్లాట్ ప్రమోటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హెచ్ రాబర్ట్ లివింగ్‌స్టన్, సింగార చెన్నై బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.హనీఫా పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ

వేలూరు, జనవరి 4: గుడియాత్తంలో గురువారం 12 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి కలెక్టర్ కుమరవేల్ పాండ్యన్ అధ్యక్షత వహించగా, వేలూరు ఎంపీ కదిర్ ఆనంద్ ముఖ్యఅతిథిగా పాల్గొని 1,440 మంది విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. కార్యక్రమంలో గుడియాత్తం ఎమ్మెల్యే అమ్ములు, గుడియాత్తం పట్టణ పంచాయతీ అధ్యక్షుడు సౌందర్, ప్రధాన విద్యాధికారి మణిమొళి తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఆనైకట్టు ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నందకుమార్ పాల్గొని విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు.

మంత్రి సెంథిల్ బాలాజి రిమాండ్ పొడిగింపు

పెరంబూర్, జనవరి 4: మంత్రి సెంథిల్ బాలాజి రిమాండ్‌ను 14వ పర్యాయం పొడిగిస్తూ చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయంలో రవాణా శాఖ మంత్రిగా వ్యవహరించిన సెంథిల్ బాలాజీ, రవాణా శాఖలో ఉద్యోగాలిప్పిస్తామంటూ లంచం తీసుకున్నారనే ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంలో చట్టవ్యతిరేక నగదు బట్వాడా కేసులో, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గత జూన్ 14వ తేది మంత్రి సెంథిల్ బాలాజీ అరెస్ట్ చేసి స్థానిక పుళల్ కారాగారానికి తరలించారు. సెంథిల్ బాలాజి రిమాండ్ గురువారంతో ముగియడంతో, ఆయనను జైలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి అల్లి ముందు హాజరుపరచగా, ఈ నెల 11వ తేది వరకు రిమాండ్ పొడిగిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

కాటన్ సిల్క్ ప్రదర్శనకు విశేష స్పందన

చెన్నై, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్థానిక వైఎంసీఏ మైదానంలో ఏర్పాటైన 'కాటన్, సిల్క్ ఫ్యాబ్' ప్రదర్శనకు విశేష స్పందన లభిస్తోందని నిర్వాహకులు ప్రకటించారు. దేశంలోని వివి ధ ప్రాంతాలకు చెందిన వస్త్ర వ్యాపారులు సంప్రదాయ, ఆధునిక వస్త్రాలను ఇక్కడ ప్రదర్శిస్తున్నారు. ఈనెల 14వతేదీవరకు కొనసాగనున్న ప్రదర్శనను సందర్శకులు ఉదయం 10.30నుంచి రాత్రి 8.30గంటల వరకు వీక్షించవచ్చు.

కట్టబొమ్మన్నకు మణిమండపం

● తమిళనాడు నాయుడు సంఘం విజ్ఞప్తి

ప్యారీస్, జనవరి 4: కప్పం చెల్లించమన్న బ్రిటీష్ పాలకులను ఎదిరించిన తొలి స్వాతంత్ర్య సమరయోధులు వీరపాండ్య కట్టబొమ్మన్న పేరుతో రాజధాని నగరంలో మణిమండపం ఏర్పాటు చేయాలని తమిళనాడు నాయుడు అభివృద్ధి సంక్షేమ సంఘం విజ్ఞప్తి చేసింది. కడలూరులో ఈ సంఘం ఆధ్వర్యంలో బుధవారం సాయం త్రం కట్టబొమ్మన్న 264వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మక్కల్ మున్నేట్ర ట్రస్ట్ వ్యవస్థాపకుడు, వీరపాండ్య కట్టబొమ్మన్న వంశీయుడు డా.ఇలయ కట్టబొమ్మన్న పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కట్టబొమ్మన్న పేరుతో పురస్కారాలను ఆయన జయంతి రోజు పంపిణీ చేయాలని, అలాగే, సీబీఎస్‌ఈ పాఠ్యాంశంలో ఆ మహనీయుడి జీవితచరిత్రకు చోటు కల్పించాలని కోరారు.

పోలీస్‌స్టేషన్‌లో హాజరైన పెరియార్ వర్శిటీ ప్రొఫెసర్లు

ప్యారీస్, జనవరి 4: అవినీతి, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యవహారంలో సేలం పెరియార్ వర్శిటీ ప్రొఫెసర్లు గురువారం కరుప్పూర్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విచారణకు హాజరయ్యారు. ఈ వర్శిటీ వైస్‌ఛాన్సలర్‌గా మూడేళ్లుగా జగన్నాధన్ వ్యవహరిస్తున్నారు. ఆయన అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలున్నాయి. వర్శిటీ కార్మికుల సంఘ న్యాయ విభాగం సలహాదారుడు ఇళంగోవన్ రాష్ట్రప్రభుత్వం నుంచి అనుమతి పొంది సేలం కరుప్పూర్ పోలీస్‌స్టేషన్‌లో వీసీ జగన్నాధన్, రిజిస్ట్రార్ తంగవేలు, కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ సతీష్, తిరుచ్చి భారతిదాసన్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ రామ్‌గణేశ్ తదితరులపై గత సెప్టెంబరు 9న ఫిర్యాదుచేశారు. ఈ ఆధారంగా కేసు నమోదుచేసిన పోలీసులు, ఆకస్మిక చర్యలు చేపట్టి వీసీ జగన్నాధన్‌ను అరెస్ట్ చేశారు. ఆయన వద్ద జరిపిన విచారణలో... వర్శిటీ ఫౌండేషన్ పేరుతో 10 ప్రైవేటు విద్యాసంస్థలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకొని వీసీ జగన్నాధన్ ఆర్థికంగా లబ్ధిపొందారని తేలింది. ఆయనకు వర్శిటీ రిజిస్ట్రార్ సహా పలువురు ప్రొఫెసర్లు కూడా సహకరించారని తెలిసింది. ఇదిలా ఉండగా, అరెస్టయిన జగన్నాధన్ ఇటీవల బెయిలుపై విడుదలై, గురువారం ఉదయం కరుప్పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రొఫెసర్లతో కలసి హాజరయ్యారు.

వ్యాపారి మృతి కేసులో భార్య, ప్రియుడి అరెస్టు

చెన్నై, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నానగర్ న్యూఆవడి రోడ్డు ప్రాంతంలో మూడురోజులకు ముందు జరిగిన రోడ్డు ప్రమాదంలో పాతపేపర్ల దుకాణం యజమాని ప్రేమ్‌కుమార్(37) మృతిచెందిన కేసు మలుపు తిరిగింది. భార్య కిరాయి గూండాలను ఏర్పాటు చేసి అతడిని హత్య చేయించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దీనితో ప్రేమ్‌కుమార్ భార్యను, ఆమె ప్రియుడిని అరెస్టు చేశారు. అయనవరం పెరియార్ మెయిన్‌రోడ్డులో ప్రేమ్‌కుమార్, సన్‌ప్రియ (32) అనే భార్యాభర్తలు నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. ప్రేమ్‌కుమార్ పాతపేపర్ల షాపు నడుపుతున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం వేకువజాము అన్నానగర్ న్యూ ఆవడి రోడ్డు వద్ద మోటారు బైకులో వెళుతున్న ప్రేమ్‌కుమార్‌ను వెనుకవైపు వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ప్రయాణించిన ఇరువురు పారిపోయారు. ట్రాఫిక్ పోలీసులు రోడ్డు ప్రమాదంగా భావించి కేసు నమోదు చేశారు. అయితే బుధవారం ఉదయం ప్రేమ్‌కుమార్ సోదరి తన అన్న మృతి ఘటనలో అనుమానాలున్నాయని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనితో పోలీసులు రంగంలోకి దిగి విచారణ జరిపారు. హరికృష్ణన్ అనే యువకుడితో సన్‌ప్రియ ఏర్పరచుకున్న వివాహేతర సంబంధం నేపథ్యంలో ప్రేమ్‌కుమార్‌ను హత్య చేయించినట్లు విచారణలో వెల్లడైంది. హరికృష్ణన్ స్నేహితుడైన శరత్‌కుమార్(27)సాయంతో పాత కారును రూ.38వేలకు కొనుగోలు చేసి ఆ కారుతో ప్రేమ్‌కుమార్ నడుపుతున్న మోటారు బైకును ఢీకొట్టించారని కనుగొన్నారు. ఆ మేరకు పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి సన్‌ప్రియ, హరికృష్ణన్‌ను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న శరత్‌కుమార్ ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

కిలంబాక్కం రైల్వేస్టేషన్ ఏర్పాటుకు నిధుల కేటాయింపు

పెరంబూర్, జనవరి 4: స్థానిక కిలంబాక్కం రైల్వేస్టేషన్ ఏర్పాటుకు దక్షిణ రైల్వేకు సీఎండీఏ రూ.20 కోట్లు కేటాయించింది. నగరు శివారు ప్రాంతమైన కిలంబాక్కంలో కలైంజర్ సెంటినరీ బస్ టెర్మినల్‌ను గత వారం సీఎం ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. ఈ బస్టాండ్‌నుంచి నగరంలోకి ప్రయాణికులు వచ్చేలా బస్టాండ్ సమీపంలో రైల్వేస్టేషన్ ఏర్పాటుచేయాలని రాష్ట్రప్రభుత్వం తరపున దక్షిణ రైల్వేకు సిఫారసు చేశారు. ఈ నేపథ్యంలో, రైల్వే శాఖ నిధులు కేటాయింపు ఆలస్యం అవుతుందని భావించిన రాష్ట్రప్రభుత్వం, తొలివిడతగా సీఎండీఏ ద్వారా రూ.20 కోట్లు కేటాయించినట్లు, ఈ విషయమై అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుందని ప్రభుత్వ వర్గాల సమాచారం.

కన్నియాకుమారిలో పడవ పనివేళల పొడిగింపు

పెరంబూర్, జనవరి 4: సంక్రాంతి సెలవుల సందర్భంగా కన్నియాకుమారికి వచ్చే పర్యాటకులు సముద్రం మధ్యలోని వివేకానంద రాక్‌కు వెళుతుంటారు. అందుకోసం పుంపుహార్ సంస్థ తీరం నుంచి వివేకానంద రాక్ వద్దకు పడవలు నడుపుతోంది. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ పడవ సేవలు అందుబాటులో ఉంటాయి. రాబోయే సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ ప్రాంతానికి పర్యాటకులు అధికంగా వచ్చే అవకాశముందని భావించిన పర్యాటక శాఖ, పడవల సమయాలను పెంచింది. ఉదయం 8గంటలకు ప్రారంభమయ్యే పడవ సేవలు రెండుగంటల ముందుగా 6గంటలకు, సాయంత్రం 4గంటలకు ముగిసే పడవ సమయాన్ని రెండుగంటలు పొడిగించి సాయంత్రం 6 గంటలకు వరకు కొనసాగనుందని అధికారులు తెలిపారు.

గూండా చట్టం కింద 20 మంది అరెస్ట్

పెరంబూర్, జనవరి 4: చెన్నైలో వారం రోజుల వ్యవధిలో నేరాలకు పాల్పడుతున్న ఇద్దరు మహిళలు సహా 20 మంది గూండా చట్టం కింద అరెస్టయ్యారు. ఈ మేరకు నగర పోలీసు శాఖ గురువారం విడుదల చేసిన ప్రకటనలో, నగరంలో నేరాలు, చోరీలను అడ్డుకొనేలా పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోర్ ఉత్తర్వులతో గస్తీ పనులు ముమ్మరం చేశామన్నారు. ఆ ప్రకారం, గత నెల 28 నుంచి ఈ నెల 3వ తేది వరకు నేరాలకు పాల్పడుతున్న ఇద్దరు మహిళలు సహా 20 మందిని గూండా చట్టం కింద అరెస్ట్ చేశామన్నారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి డిసెంబరు 31వ తేది వరకు హత్య, హత్యాయత్నం, బెదిరింపులకు పాల్పడుతున్న 460 మంది, చోరీలు, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన 121 మంది, మాదకద్రవ్యాల విక్రయం, మనీ ఛీటింగ్‌కు పాల్పడిన 104 మంది, సైబర్ నేరాలకు పాల్పడిన నలుగురు, వ్యభిచారవృత్తి చేయిస్తున్న 15 మంది సహా పలు నేరాలకు సంబంధించి 714 మందిని అరెస్ట్ చేసినట్లు నగర పోలీసు శాఖ తెలిపింది.

విద్యార్థులకు నగదు పురస్కారం

చెన్నై, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన అష్టావధానంలో పృచ్ఛకులుగా పాల్గొన్న స్థానిక టి.నగర్ కేసరి మహోన్నత పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి పోలా కృష్ణమూర్తి నగదు పురస్కారం ప్రదానం చేశారు. కేసరి పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు నాగుల గోపాలయ్య అధ్యక్షత వహించి ప్రసంగించారు. అవధాన బాల భాస్కర శతావధాని ఉప్పలదడియం భరత్ శర్మ ఆధ్వర్యంలో చేపట్టిన అవధాన కార్యక్రమంలో పృచ్ఛకులుగా హాజరైన విద్యార్థుల గురించి మీడియా ద్వారా తెలుసుకుని, వారిని నగదు పురస్కారంతో సత్కరించడం ఎంతైనా ప్రశంసనీయమన్నారు. అనంతరం పోలా కృష్ణమూర్తి మాట్లాడుతూ.. విద్యార్థులే పృచ్ఛకులుగా వ్యవహరించడం గొప్ప విషయమని అభినందించారు.

అంబత్తూర్ రోడ్డుపై హఠాత్తుగా గొయ్యి



పెరంబూర్, జనవరి 4: స్థానిక అంబత్తూర్ మండల పరిధిలోని మేనాంబేడు-జంక్షన్ ప్రధాన రోడ్డుపై గురువారం తెల్లవారుజామున హఠాత్తుగా గొయ్యి ఏర్పడింది. సుమారు 20 అడుగుల లోతున గొయ్యి ఏర్పడగా, ఆ సమయంలో వాహన రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేషన్ అధికారులు హుటాహుటిన అక్కడకు చేరుకొని గొయ్యి పూడ్చే పనులు చేపట్టారు.

స్టెరిలైట్ కర్మాగారాన్ని అనుమతించొద్దు

● పీఎంకే నేత డా.రాందాస్

ప్యారీస్, జనవరి 4: తూత్తుకుడి స్టెరిలైట్ కాపర్ తయారీ కర్మాగారాన్ని తెరిచేందుకు అనుమతించరాదని రాష్ట్రప్రభుత్వానికి పీఎంకే వ్యవస్థాపకులు డా.రాందాస్ ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. స్టెరిలైట్ కర్మాగారం యాజమాన్యం దాఖలుచేసిన కేసును మద్రాసు హైకోర్టు తోసిపుచ్చిందని, దీనిని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన అప్పీలు త్వరలో విచారణకు రానుందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ వాణిజ్య సంస్థలతో సంబంధాలున్న స్టెరిలైట్ ఫ్యాక్టరీ యాజమాన్యం తనకున్న పలుకుబడితో మళ్లీ ఈ ఫ్యాక్టరీని ప్రారంభించే చర్యలు చేపట్టిందని తెలిపారు. గత 2010లో మద్రాసు హైకోర్టు ఉత్తర్వులతో మూతపడిన ఈ ఫ్యాక్టరీలకి ఎట్టి పరిస్థితుల్లోను పునఃప్రారంభించేందుకు రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకోరాదని రాందాస్ డిమాండ్ చేశారు.

రేపు వేకువజామున 3 గంటలకే మెట్రోరైళ్లు

పెరంబూర్, జనవరి 4: నగరంలో శనివారం నిర్వహించనున్న మారథాన్‌ను పురస్కరించుకొని వేకువజామున 3 గంటల నుంచి 15 నిముషాల వ్యవధిలో మెట్రోరైళ్లు నడువనున్నాయి. ఈ మేరకు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో, ఈ పోటీల్లో పాల్గొనే వారు క్యూ ఆర్ కోడ్ చూపించి రైళ్లలో ఉచితంగా ప్రయాణం చేయవచ్చని, అదే కోడ్‌తో తమ వాహనాలను ఉచితంగా పార్కింగ్ చేసుకోవచ్చని తెలియజేసింది.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

437 గ్రాముల బంగారు నగలు, 417 గ్రాములు వెండి రికవరీ ● వివరాలు వెల్లడించిన ఎస్పీ కృష్ణారావు


మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు

రాయచోటి టౌన్, జనవరి 4: దక్షిణాది రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడే ఏడుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.21 లక్షల 87 వేల 500 విలువ గల 437 గ్రాముల బంగారం నగలు, 417 గ్రాముల వెండి ఆభరణాలు, ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం అన్నమయ్య జిల్లా రాయచోటిలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ కృష్ణారావు మీడియాకు వివరాలు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరు జిల్లా మొట్టుపాల్యం, ఉత్తయంద్రం, మంతిపట్టం, చెట్టికుట్టై, వనియంబడి, అన్నానగర్, దేవస్థనం తదితర ప్రాంతాలకు చెందిన కార్తికేయన్ మురగేంద్రన్, మోహన్‌రాజ్, శక్తివెల్, మురళి, దినగరన్, తిరుపతి, వెంకటేశ్, చిన్నపయ్యన్‌లు ఒక ముఠాగా ఏర్పడి కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నేరాలకు పాల్పడుతూ సుమారు 7 పోలీస్‌స్టేషన్‌లలో 10 దొంగతనాలు చేసినట్లు గుర్తించామన్నారు. గత ఏడాది డిసెంబరు 23వ తేదీ గుర్రంకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల నడిమికండ్రిగ పంచాయతీ ప్యారంపల్లెలో ఒక ఇంటిలో పగటిపూట దొంగతనం చేసినట్లు కేసు నమోదైందన్నారు. దర్యాప్తులో భాగంగా అదేరోజు పెద్దమండెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూడు పగటి దొంగతనాలు, తంబళ్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక దొంగతనం చేసినట్లు కేసులు నమోదయ్యాయని తెలిపారు. దీంతో ప్రత్యేక నిఘాలో భాగంగా రాయచోటి సబ్ డివిజన్ డీఎస్పీ మహబూబ్‌బాషా పర్యవేక్షణలో వాయల్పాడు సీఐ సురేశ్‌కుమార్, గుర్రంకొండ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆదిలీప్ కుమార్‌లు రెండు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ముమ్మరం చేసినట్లు చెప్పారు. దర్యాప్తులో భాగంగా గతంలో రాయచోటి సబ్‌డివిజన్ పరిధిలో కూడా ఇదేవిధంగా పగటి దొంగతనాలు జరిగినట్లు గుర్తించామన్నారు. నేరస్థలాలకు దగ్గరలో గల సీసీ కెమెరా ఫుటేజ్‌లను పరిశీలించి అనుమానితుల ఫొటోలను సేకరించామన్నారు. ఈ క్రమంలో కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఇటువంటి నేరాలకు పాల్పడే నిందితులను గుర్తించడంతో పాటు వారి ఆచూకీ తెలుసుకుని ఏడుగురిని అదుపులోకి తీసుకొని విచారించగా వీరు గతంలో కూడా తమిళనాడు రాష్ట్రంలో చోరీ కేసుల్లో అరెస్టు అయి బయటకు వచ్చినట్లు తెలియజేశారు. వీరిపై జిల్లా పరిధిలోని గుర్రంకొండ, పెద్దమండెం, తంబళ్లపల్లె, కలకడ, వాయల్పాడు, లక్కిరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్‌లలో చోరీ కేసులు అయినట్లు వివరించారు. వీరిని కోర్టులో హాజరుపర్చినట్లు ఆయన తెలియజేశారు. చోరీ కేసులను ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన వాయల్పాడు సీఐ సురేశ్‌కుమార్, గుర్రంకొండ, ఎస్ఐ దిలీప్‌కుమార్, ఏఎస్ఐ మోసెస్, హెడ్‌కానిస్టేబుల్ జగదీశ్, హోంగార్డు రాఘవ, టెక్నికల్ టీం హెడ్ కానిస్టేబుల్ రవి, కానిస్టేబుల్ రాఘవ, వాయల్పాడు పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్స్ సతీశ్, అబ్దుల్లాలకు ఎస్పీ రివార్డులు అందజేసి అభినందించారు.

పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా పోలీసు అధికారుల బదిలీ..!

● 10లోపు జాబితా కోరిన డీజీపీ

ప్యారీస్, జనవరి 4: పార్లమెంటు ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో, మూడేళ్లకు పైగా ఒకే ప్రాంతంలో విధుల్లో కొనసాగుతూ బదిలీ చేయాల్సిన పోలీసు అధికారుల జాబితా ఈ 10వ తేదీలోపు సమర్పించాల్సిందిగా డీజీపీ శంకర్‌జివాల్ ఉత్తర్వులు జారీ చేశారు. పార్లమెంటు ఎన్నికలను మే నెలలో నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఏర్పాట్లు ప్రారంభించింది. ఓటర్ల ముసాయిదా జాబితాను కూడా ఇటీవల విడుదల చేసింది. ఈ నెలాఖరుకు ఓటర్ల తుది జాబితా కూడా విడుదల చేసే సంకల్పంతో ఎన్నికల కమిషన్ రిటర్నింగ్ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే ముందు ఒకే ప్రాంతంలో మూడేళ్లకు పైగా ఉద్యోగాలు నిర్వహిస్తున్న అధికారులను బదిలీ చేయడం ఆనవాయితీ. ఆ రీతిలో రాష్ట్ర పోలీసు శాఖలో తొలివిడతగా పోలీసు అధికారులను బదిలీ చేయాల్సిందిగా కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఆ మేరకు బదిలీ చేయాల్సిన అధికారుల జాబితాను ఈ నెల 10లోపు తయారుచేయాలని నగర పోలీసు కమిషనర్లు, డీఐజీలు, ఐజీలకు డీజీపీ శంకర్‌జివాల్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. కాగా, పోలీసు శాఖలో కంప్యూటర్ విభాగం, ప్రత్యేక విభాగాల్లో పనిచేస్తున్న అధికారులకు మాత్రం బదిలీల నుంచి మినహాయింపు కల్పించారు. డీజీపీ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు, నోటిఫికేషన్ విడుదలయ్యే ముందు పదవీవిరమణ పొందనున్న అధికారులకు ఈ ఉత్తర్వులు వర్తించవని డీజీపీ తెలిపారు.

కొడనాడు హత్య, దోపిడీ వ్యవహారం

ఈపీఎస్ సాక్ష్యం నమోదు

పెరంబూర్, జనవరి 4: కొడనాడు హత్య, దోపిడీ వ్యవహారంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సాక్ష్యాన్ని ప్రత్యేక న్యాయవాది నమోదుచేశారు. కొడనాడు హత్య కేసు నిందితుడు కనకరాజ్ సోదరుడు ధనపాలన్, ఈ కేసుకు సంబంధించి తన పేరును వినియోగించేందుకు నిషేధం విధించాలని పళనిస్వామి మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. ఈ కేసుకు సంబంధించి తన వాదనలు వినిపించేందుకు స్వయంగా హాజరుకావడంపై మినహాయింపు ఇవ్వాలని, న్యాయస్థానం నియమించే న్యాయవాది వద్ద సాక్ష్యం నమోదుచేస్తానని పళనిస్వామి హైకోర్టు ప్రశ్నకు సమాధానమిచ్చారు. పళనిస్వామి వాదన పరిగణలోకి తీసుకున్న న్యాయస్థానం న్యాయవాది కార్తీకైబాలన్‌ను నియమించింది. గురువారం ఆయన పళనిస్వామి వద్ద సాక్షం నమోదుచేసి, దానిని నివేదికగా హైకోర్టుకు సమర్పించారు.

కరోనాతో ఒకరి మృతి

పెరంబూర్, జనవరి 4: కరోనా లక్షణాలతో నగరానికి చెందిన 42 ఏళ్ల వ్యక్తి మృతిచెందాడు. రాష్ట్రంలో రెండు వారాలుగా కరోనా కేసులు స్వల్పంగా పెరుగుతుండగా, జేఎన్-1 రకం కొత్త వైరస్ లక్షణాలు 30 మందికి నిర్ధారణ అయినట్లు ఆరోగ్యశాఖ ప్రకటించింది. అదే సమయంలో, ఐదేళ్ల అనంతరం నాలుగు రోజుల క్రితం రాష్ట్రంలో కరోనా మృతి నమోదైంది. ఈ నేపథ్యంలో, బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 29 మంది కరోనా నిర్ధారణ అయింది. కరోనా లక్షణాలతో గత నెల 31వ తేది నుంచి రాజీవ్ గాంధీ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న 42 ఏళ్ల వ్యక్తి మృతిచెందాడు. ప్రస్తుతం 178 మంది కరోనా లక్షణాలతో చికిత్స పొందుతున్నట్లు ఆరోగ్యశాఖ తెలియజేసింది.

రసాయనాలు కలిసిన ఖర్జూరాలు స్వాధీనం

ఐసిఎఫ్, జనవరి 4: తెన్‌కాశి జిల్లా కుత్రాలంలో రసాయన ఆయిల్ కలిపిన ఒక టన్ను ఖర్జూరాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కుత్రాలం జలపాతం సమీపంలో ఏర్పాటైన పలు దుకాణాల్లోని ఆహార పదార్థాలను పర్యాటకులు, శబరిమల వెళ్లే భక్తులు కొనుగోలు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో, వ్యాపారులు రసాయన ఆయిల్ కలిపిన ఖర్జూరాలు విక్రయిస్తున్నట్లు ఆహార భద్రత శాఖ అధికారులకు ఫిర్యాదులందాయి. సమాచారం మేరకు దుకాణాల్లో తనిఖీలు చేపట్టిన అధికారులు, రసాయన ఆయిల్ కలిపిన 1 టన్ను ఖర్జూరాలు స్వాధీనం చేసుకున్నారు.

రైఫిల్ షూటింగ్ శిక్షణలో బాలుడికి గాయాలు

పెరంబూర్, జనవరి 4: స్థానిక తాంబరం సమీపం ముడిచ్చూర్‌లో చెంగల్పట్టు రైఫిల్ క్లబ్ పేరిట రైఫిల్ షూటింగ్ శిక్షణా కేంద్రం పనిచేస్తోంది. ఈ కేంద్రంలో పాఠశాల విద్యార్థులతో పాటు పలువురు శిక్షణ పొందుతు న్నారు. గురువారం ఉదయం యథావిధిగా విద్యార్థులు శిక్షణలో పాల్గొన్నారు. అదే ప్రాంతానికి చెందిన 7వ తరగతి చదువుతున్న 13 ఏళ్ల బాలుడు శిక్షణ పొందుతుండగా, శిక్షణలో ఊహించని విధంగా తను తప్పుగా రైఫిల్ షూట్ చేయడంతో, బాలుడి తల వెనుక భాగంలో తూటా దూసుకెళ్లింది. అధికారులు బాలుడిని వెంటనే క్రోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై విచారణ చేపట్టినట్లు శిక్షణా కేంద్రం అధికారులు తెలిపారు.

గుట్కా, హాన్స్ విక్రయించే దుకాణాలకు సీలు

● ఆరోగ్యశాఖ కార్యదర్శి గగన్‌దీప్‌సింగ్ బేడీ

ప్యారీస్, జనవరి 4: రాష్ట్రంలో నిషేధించిన గుట్కా, హాన్స్ తదితర పొగాకు వస్తువులు విక్రయించే దుకాణాలకు సీలు వేయనున్నట్లు ఆరోగ్యశాఖ కార్యదర్శి గగన్‌దీప్‌సింగ్ బేడీ హెచ్చరించారు. ఆయన గురువారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో 391 రకాల పొగాకు సంబంధిత విక్రయాలను ప్రభుత్వం నిషేధించిందని, గత ఏడాది మే నెలలో జారీచేసిన ఈ ఉత్తర్వులను ఆహార భద్రతా శాఖ మరో ఏడాది పొడిగించిందని తెలిపారు. గత డిసెంబరు 11 నుంచి 26వ తేది వరకు ఆరోగ్యశాఖ, ఆహార భద్రత శాఖ అధికారులు సంయుక్తంగా 993 దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నిషేధించిన పొగాకు వస్తువులను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఈ దుకాణాలకు రూ.37.70 లక్షలు జరిమానా విధించామని, అదే సమయంలో పోలీసు శాఖ నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడిన 1,400 దుకాణాలకు సీలు వేసినట్లు తెలిపారు. చట్టవిరుద్ధంగా పొగాకు వస్తువులు విక్రయించే దుకాణాలకు మొదటిసారి రూ.5,000, రెండవసారి రూ.10,000 చొప్పున జరిమానా విధిస్తామని, వీరు మూడవ సారి పట్టుబడితే రూ.25,000 జరిమానాతో పాటు దుకాణాలకు సీలు వేస్తామని గగన్‌దీప్ సింగ్ బేడీ హెచ్చరించారు.

అనారోగ్యంతో అసిస్టెంట్ కమిషనర్ మృతి

భార్య కిడ్నీ దానం వృథా

అడయార్, జనవరి 4: సేలం కార్పొరేషన్‌లో నేర విభాగంలో అసిస్టెంట్ పోలీస్ కమిషనరుగా పనిచేస్తూ వచ్చిన యూజిన్ అక్టోవియస్ సతీష్ (52) అనారోగ్యంతో కన్నుమూశారు. ఈయనకు కిడ్నీలు పాడైపోవడంతో భార్య కిడ్నీ దానం చేయడంతో అపరేషన్ చేసి అమర్చారు. ఆ తర్వాత ఆయన చికిత్స పొందుతూ వచ్చిన ఆయన ఆరోగ్యం మరింతగా క్షీణించడంతో గురువారం తెల్లవారుజామున 2.45 గంటల ప్రాంతంలో కన్నుమూశారు. ఈయనకు భార్య, రోస్‌లిన్ మేరీ, రిట్టు, రిజు అనే కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన భౌతికకాయాన్ని సేలం జిల్లాలోని అళగాపురం తిరుమల్ నగర్‌లోని స్వగృహానికి తరలించి, ఆ తర్వాత అంత్యక్రియలను పూర్తి చేశారు.

అదృశ్యమైన బాలికతో వచ్చే వారం హాజరుకావాలి

● కొరట్టూరు పోలీసులకు న్యాయస్థానం ఉత్తర్వులు

ప్యారీస్, జనవరి 4: స్థానిక కొరట్టూరుకు చెందిన 13ఏళ్ల బాలిక గత డిసెంబరు 16న అదృశ్యమైన వ్యవహారంలో వచ్చే వారంలోపు బాలికతో పాటు హాజరుకావాల్సిందిగా న్యాయస్థానం పోలీసులకు ఉత్తర్వులు జారీచేసింది. పాఠశాలకు వెళ్లిన బాలిక సాయంత్రం ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆమె కోసం తల్లిదండ్రులు, బంధువులు పలు ప్రాంతాల్లో గాలించిన జాడ తెలియలేదు. దీంతో కొరట్టూరు పోలీస్‌స్టేషన్‌లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసిన పోలీసులు, చిన్నారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. 15 రోజులు గడుస్తున్నా తమ కుమార్తె జాడ తెలియకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు, న్యాయస్థానంలో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలుచేశారు. దీనిని పరిశీలించిన న్యాయస్థానం, కనిపించకుండా పోయిన బాలికతో వచ్చే వారం కోర్టులో హాజరుకావాల్సిందిగా ఆదేశించింది.

నేత్రపర్వంగా భగవతి అమ్మవారికి గాజుల అలంకారం



ప్యారీస్, జనవరి 4: తిరుచ్చి జిల్లా మనచ్చనల్లూర్‌లో ప్రసిద్ధిచెందిన భగవతి అమ్మవారి ఆలయ 123వ వార్షికోత్సవాల్లో గురువారం అమ్మవారిని నేత్రపర్వంగా గాజులతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆలయంలో గత నెల 28వ తేది స్తంభస్థాపన పూజలతో ప్రారంభమైన ఉత్సవాల్లో రోజుకో విధంగా అమ్మవారిని అలంకరిస్తున్నారు. ఏడవ రోజైన గురువారం 108 మంది ముత్తయిదువులు సుమంగళి పూజ నిర్వహించిన సందర్భంగా, అమ్మవారికి గాజుల అలంకారం చేసి అభిషేక, దీపారాధనలు నిర్వహించారు.



అష్టోత్తర శత వైష్ణవ దివ్యదేశాలలో 19వ దివ్యదేశంగా నాగపట్టినం నగరంలోని సౌందరరాజపెరుమాళ్ ఆలయం కీర్తిగడించింది. ఆదిశేషుడు తపమాచరించి మహావిష్ణువుకు శయనతల్పంగా మారిన దివ్యక్షేత్రమిది. ఈ కారణంగానే ఈ నగరానికి నాగన్‌పట్టినం అనే పేరొచ్చింది. కాలగమనంలో ఆ పేరు కాస్త నాగపట్టినంగా రూపాంతరం చెందింది. కృతయుగంలో భూదేవి, ద్వాపరయుగంలో మార్కండేయుడు ఈ క్షేత్రంలో తపమాచరించినట్లు పురాణగాథలు చెబుతున్నాయి. తిరుమంగై ఆళ్వార్ తన పెరియ తిరుమొళిలో ఈ క్షేత్ర మహిమలపై మంగళాశాసనమొనర్చారు. ఆలయంలోని పెరుమాళ్ సకల దోషాలను తొలగించి భక్తులను అనుగ్రహిస్తున్నారు. - ఆంధ్రజ్యోతి, చెన్నై



ఇష్టదేవేరులతో సౌందరరాజపెరుమాళ్

ఆదిశేషుడు తపమాచరించిన దివ్యదేశం

ఆధ్యాత్మికం

● సకల దోష నివృత్తి క్షేత్రం నాగై పెరుమాళ్ ఆలయం

స్థల పురాణం

ఉద్దానపాద మహారాజు కుమారుడు ధ్రువుడు నారద మహర్షి ద్వారా నాగపట్టినం క్షేత్ర మహిమలను తెలుసుకు, సమస్త లోకాలను తానే పరిపాలించాలనే ఆకాంక్షతో పెరుమాళ్‌ను ధ్యానిస్తూ ఈ స్థలంలో ఘోరతపమాచరించారు. ధ్రువుడి తపస్సును భంగమొనర్చటానికి దేవతలు అన్ని విధాలా ప్రయత్నించి విఫలురయ్యారు. ధ్రువుడు తన తపస్సును నిర్విఘ్నంగా పూర్తిచేశారు. గరుడ వాహనంపై పెరుమాళ్ ప్రత్యక్షమయ్యారు. ఆ పెరుమాళ్ సౌందర్యాన్ని చూసిన ధ్రువుడు తానడగాల్సిన వరాన్ని కూడా మరచిపోయాడు. ఆ దేవదేవుడి సౌందర్యాన్ని వీక్షించడమే మహాభాగ్యమని భావించాడు. ఆ సౌందర్యాన్ని ఎల్లప్పుడూ దర్శించే భాగ్యాన్ని తనకు ప్రసాదించమని వేడుకున్నారు. ఆ మేరకు పెరుమాళ్ ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకున్నారు. అప్పటి నుండి ఈ క్షేత్రపు పెరుమాళ్‌ను సౌందరరాజ పెరుమాళ్ పిలుస్తున్నారు. తిరుమంగై ఆళ్వారు కూడా ఈ స్వామివారి అందాలను వీక్షించి వింత అనుభూతిని పొంది తొమ్మిది కీర్తనలను పాడిన తర్వాతే పదో కీర్తనలో ఈ క్షేత్రపు నామధేయాన్ని పేర్కొన్నారు.

నాగపట్టినం

ఆదిశేషుడు ఈ క్షేత్రంలో సార పుష్కరిణి అనే పేరుతో ఓ తీర్థాన్ని నెలకొల్పి ఆ తీర్థపుగట్టునే పెరుమాళ్‌ను ధ్యానిస్తూ తపమాచరించారు. ఆదిశేషుడి తపస్సును మెచ్చి పెరుమాళ్ అతడి ఎదుట ప్రత్యక్షమయ్యారు. ఆదిశేషుడి కోరిక మేరకు అతడిని తనకు శయనతల్పంగా మారి సేవలందించేందుకు స్వామివారు అంగీకరించారు. ఆ కారణంగానే ఈ క్షేత్రానికి నాగపట్టినం అనే పేరొచ్చింది. ఈ క్షేత్రంలో ఆదిశేషుడు నెలకొల్పిన సార పుష్కరిణిలో స్నానమాచరించి స్వామివారిని దర్శిస్తే సూర్యమండలాన్ని చేరుకోవచ్చునన్నది ఐతిహ్యం. కంఠుడు, సుకంఠుడు అనే రాక్షస సోదరులు ప్రజలను నానా హింసలు పెట్టి వేధించేవారు. ఓసారి ఆ ఇరువురూ ఇక్కడి సార పుష్కరిణిలో స్నానం చేయడంతో వారి పాపాలన్నీ తొలగి సుగుణవంతులుగా మారిపోయారు. ఆ ఇరువురి శిల్పాలు ఇక్కడి ఆలయంలో పెరుమాళ్ సన్నిధిలో ఉన్నాయి.



ఆలయ అంతర ప్రాకారం



గరుడ వాహనంపై కనువిందు చేస్తున్న పెరుమాళ్

ఆలయ వైభవం

రాజగోపురాన్ని దాటుకుని లోపలకు వెళితే బలిపీఠం, ధ్వజస్తంభం, దానికి చేరువగా గరుడాళ్వార్ సన్నిధి ఉన్నాయి. గర్భాలయంలో మూలవిరాట్టు సౌందరరాజపెరుమాళ్ స్వామి తూర్పుదిశగా నిలిచిన భంగిమలో భక్తులను అనుగ్రహిస్తున్నారు. దశావతారాలను తెలిపేలా రాగిరేకులతో కూడిన మాలను స్వామివారు వడ్డాణంలా ధరించి భక్తులకు కనువిందు చేస్తారు. మూలవర్ల సన్నిధికి ఎదురుగా ఉన్న మంటపంలో సౌందరరాజపెరుమాళ్ శయనభంగిమలో దర్శనమిస్తారు. పక్కనే సేనై ముదల్వార్, ఆళ్వార్, ఆచార్యుల సన్నిధులు ఉన్నాయి. గర్భాలయం గోడలపై అందమైన చిత్రలేఖనాలు కూడా ఉన్నాయి. వెలుపలి ప్రాకారంలో వైకుంఠనాథుడు, సౌందరవల్లి తాయార్, శీనివాస పెరుమాల్, ఆండాళ్, శ్రీరామచంద్రమూర్తి, వీర ఆంజనేయుడి సన్నిధులు కూడా ఉన్నాయి. ఈ ఆలయంలోని అష్టభుజ దుర్గాదేవి అత్యంత శక్తివంతురాలిగా కీర్తింపబడుతున్నారు. ఇక్కడి ఆలయంలోని నరసింహస్వామి అష్టభుజాలతో దర్శనమిస్తారు. ప్రహ్లాదుడిని ఆశీర్వదించే భంగిమలో ఓ హస్తం, అభయహస్త భంగిమలో మరో హస్తం, తక్కిన ఆరు హస్తాలు హిరణ్యకశిపుడిని వధించే భంగిమలో ఉన్నాయి. ఆదిశేషుడు, ధ్రువుడు, తిరుమంగై ఆళ్వార్, సాలిశుకచోళన్ ఈ క్షేత్రపు పెరుమాళ్‌ను దర్శించి తరించారు. పిళ్లై పెరుమాళ్ అయ్యంగార్, తిరుగురుక్కై పెరుమాళ్ కవిరాయర్, ముత్తుస్వామి దీక్షితర్ తదితరురులు కూడా ఇక్కడి స్వామివారిని పొగడుతూ కీర్తనలను రచించారు.



నీలమేఘ పెరుమాళ్

ఆలయ విశేషాలు

బ్రహ్మాండపురాణం ఉత్తరకాండంలోని 10వ అధ్యాయయంలో సౌందర్య ఆరణ్యమహిమ పేరుతో ఈ దివ్యక్షేత్రానికి సంబంధించిన విశేషాలు పొందపరచి ఉన్నాయి. ఈ ఆలయంలో పంగుణి బ్రహ్మోత్సవాలు, ఆని ఉత్తిర వేడుకలు, ఆండాళ్ ఆడిపూర వేడుకలు తలా పది రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఇలా యేడాదికి మూడు బ్రహ్మోత్సవాలు జరుపుకునే స్వామి, అమ్మవార్లు భక్తులకు వివిధ వాహనాలలో కొలువుదీరి కనువిందు చేస్తారు. ఇక తై, పురటాసి శనివారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ ఆలయంలో రోజూ ఉదయం 7.30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 5.30 నుండి రాత్రి 9 గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

ఎలా వెళ్ళాలి?

జిల్లా కేంద్రమైన నాగపట్టినంకు వెళ్లేందుకు అన్ని నగరాల నుండి రాష్ట్ర రవాణా సంస్థ ఎక్స్‌ప్రెస్ సర్వీసు బస్సులు ఉన్నాయి. చెన్నై నుండి రైలులోనూ నాగపట్టినంకు వెళ్ళవచ్చు. నాగపట్టినం బస్టాండు, రైల్వేస్టేషన్‌లో దిగి ఆటోలు, టాక్సీలలో పది నిమిషాలపాటు ప్రయాణించి ఈ ఆలయాన్ని చేరుకోవచ్చు.



సార పుష్కరిణి

యునిసెఫ్ ప్రశంసలు పొందిన 'తమిళ గీతం'

● వైరముత్తు అభినందన

చిత్రజ్యోతి

మదురై కేంద్రంలో ప్రముఖ విద్యా సంస్థగా ఉన్న క్వీన్ మీరా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఒక తమిళ గీతాన్ని ఆవిష్కరించగా, దీనికి యునిసెఫ్ ప్రశంసలు దక్కాయి. ఈ తమిళ గీతం ఈ పాఠశాలకు జాతీయ గీతంలా పేర్కొంటున్నారు. ప్రపంచ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ముంబైలో జరిగిన ఈ పాటతోపాటు క్వీన్ మీరా ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యాన్ని యునిసెఫ్ ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ విజయోత్సవ వేడుకలను బుధవారం నగరంలో జరుపుకున్నారు. ఈ గేయ రచయిత మదన్ కార్కీ, సంగీత దర్శకుడు అనిల్ శ్రీనవాసన్, పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ అభినాథ్ చంద్రన్, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ కవి, సినీ గేయరచయిత వైరముత్తు పాల్గొని ఈ గీత సృష్టికర్తలతోపాటు పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. 'ఈ రోజు నాకు చాలా గర్వంగా ఉంది. వైగై నదీ ఒడ్డున ఉండే ఒక పాఠశాల ఒక్క తమిళ గీతంతో ప్రపంచ వేదికపై గుర్తింపు పొందింది. ఈ గుర్తింపునకు కారణమైన గేయ రచయిత మదన్ కార్కీ, మ్యూజిక్ కంపోజర్ అభినాథ్ చంద్రన్‌లను అభినందిస్తున్నాను. ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ అయిన యునిసెఫ్ ద్వారా ప్రపంచ వేదికపై ఈ ఘనతను సాధించడం అంత తేలికైన విషయం కాదు. ఈ గేయ సాహిత్యంలోని సరళత, వాస్తవిక అంశాలే ఈ పాటకు ప్రపంచ వేదికపై ప్రత్యేక గుర్తింపునకు దోహదపడ్డాయి. అభినాథ్ చంద్రన్... తన ఆత్మ, దేహం, ప్రాణం, ధనం, జీవితాన్ని విద్యాభ్యాసానికే అంకితం చేశారు. ఎక్కువగా విదేశాల్లో ఉండే అభినాథ్.. రాష్ట్రంలో పక్కా సమయపాలన అనుసరిస్తారు. అనిల్ శ్రీనివాసన్ ఒక సంగీత దర్శకుడు మాత్రమే సంగీత ఉపాధ్యాయుడు కూడా. ఆయన అనేక మంది యువకులకు సంగీతం నేర్పించాను. ఎంతో ప్రతిభావంతుడై సంగీత దర్శకుడు. మదన్ కార్కీ ఈ పాట కోసం ఎంతో సరళతో కూడిన పదాలను ఉపయోగించారు. ప్రతి ఒక్కరికీ అర్థమయ్యే రీతిలో ఉదాత్తమైన ఆలోచనలు చెప్పారు' అయన వివరించారు.



పాఠశాల నిర్వాహకులను అభినందిస్తున్న వైరముత్తు

దుషార విజయన్ గ్లామర్ షో!

'సర్పట్టా పరంబరై' చిత్రంలో మారియమ్మ పాత్రలో అద్భుతంగా నటించిన యువ హీరోయిన్ దుషార విజయన్... ఆ తర్వాత 'కళువేత్తి మూర్ఖన్', 'అనీతి' వంటి పలు చిత్రాల్లో నటించారు. ప్రస్తుతం ఆమె సూపర్‌స్టార్ రజినీకాంత్ నటిస్తున్న 'వేట్టయ్యాన్' చిత్రంలో ఓ పాత్రను పోషిస్తున్నారు. అయితే, గత కొంతకాలంగా ఆమె సోషల్ మీడియాలో ఎంతో యాక్టివ్‌గా ఉంటూ, ప్రత్యేక ఫోటోషూట్‌లు నిర్వహించి ఆ ఫోటోలను షేర్ చేసే హీరోయిన్ల జాబితాలో దుషారా ఒకరు. అయితే, ఇప్పటివరకు ఆమె షేర్ చేసిన ఫోటోలు ఎంతో సంప్రదాయబద్ధంగా ఉన్నాయి. కానీ, తాజాగా షేర్ చేసిన ఫోటోలు మాత్రం ఎంతో గ్లామర్‌గా, స్కిన్ షో చేస్తూ కనిపించాయి. ఈ ఫోటోలను చూసిన ఆమె అభిమానులు సైతం ఆశ్చర్యపోయారు. ముఖ్యంగా తమిళ హీరోయిన్లు ఎవరూ ఈ తరహా బికినీ దుస్తులు ధరించి ఫోటోలు తీసి... సోషల్ మీడియాలో షేర్ చేసిన సందర్భాలు లేవు. కానీ, దుషారా మాత్రం ఎంతో ధైర్యంగా ఈ గ్లామర్ ఫోటోలను షేర్ చేసి అందర్నీ ఆశ్చర్యపరిచారు.



'కలైంజర్-100'కు సీఎం స్టాలిన్‌కు ఆహ్వానం

● పాలుపంచుకోనున్న కోలీవుడ్ తారాగణం

మాజీ ముఖ్యమంత్రి దివంగత కలైంజర్ కరుణానిధి శతజయంతి వేడుకలను పురస్కరించుకుని 'కలైంజర్-100' పేరుతో ఒక స్మారక కార్యక్రమాన్ని తమిళ చిత్ర పరిశ్రమ నిర్వహించనుంది. ఈ నెల 6వ తేదీ శనివారం సాయంత్రం జరిగే ఈ కార్యక్రమాన్ని కోలీవుడ్‌లోని 24 క్రాఫ్టులు కలిసి ఘనంగా నిర్వహిస్తున్నాయి. ఈ వేడుకలో పాల్గొనాల్సిందిగా ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో పాటు ఆయన తనయుడు, మంత్రి, సినీ హీరో ఉదయనిధి స్టాలిన్‌లను ఆహ్వానించారు. అలాగే, తమిళ చిత్రపరిశ్రమకు చెందిన నటీనటులందరికీ ఆహ్వానాలు పంపించారు. అగ్ర నటీనటులు కమల్ హాసన్, రజినీకాంత్, ధనుష్, శరత్ కుమార్, నయనతార ఇలా ప్రతి ఒక్కరినీ ఆహ్వానించారు. అదేవిధంగా తెలుగు హీరో చిరంజీవి, వెంకటేష్, మలయాళంలో మమ్ముట్టి, మోహన్‌లాల్, కన్నడంలో శివరాజ్ కుమార్, బాలీవుడ్ నుంచి అగ్ర నటులను తమిళ చిత్ర పరిశ్రమ పెద్దలు ఆహ్వానించారు. దాదాపు ఆరు గంటల పాటు జరిగే ఈ కార్యక్రమంలో వివిధ రకాలై సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించేలా ప్లాన్ చేశారు. అలాగే, కరుణానిధి మాటలు, పాటలు సమకూర్చిన చిత్రాల్లోని పాపులర్ డైలాగులు, పాటల క్లిప్పింగ్స్‌ను, కలైంజర్ డాక్యుమెంటరీ ఫిల్మ్‌లను కూడా ప్రదర్శించనున్నారు. ఇందుకోసం గిండీలోని రేస్ కోర్స్ మైదానంలో భారీ ఎత్తున ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి.



సీఎం స్టాలిన్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దృశ్యం

ముఖ్యమంత్రి కావాల్సిన నేత విజయకాంత్

● సీనియర్ నటుడు శివకుమార్

రాష్ట్ర ముఖ్యమంత్రి కావాల్సిన నేత కెప్టెన్ విజయకాంత్ అని సీనియర్ నటుడు శివకుమార్ అభిప్రాయపడ్డారు. స్థానిక కోయంబేడులోని డీఎండీకే ప్రధాన కార్యాలయంలో ఖననం చేసిన విజయకాంత్ సమాధికి తన చిన్న కుమారుడు, హీరో కార్తీతో కలిసి శివకుమార్ గురువారం నివాళులు అర్పించారు. ఆ తర్వాత హీరో కార్తీ విలేకరులతో మాట్లాడుతూ, 'విజయకాంత్ ఇపుడు మనమధ్య లేరనే విషయం జీర్ణించుకోలేనిది. ఆయన అంతిమయాత్రలో పాల్గొని నివాళులు అర్పించలేకపోయామనే విషయం జీవితాంతం వేధిస్తూనే ఉంటుంది. కెప్టెన్‌తో సన్నిహితంగా మెలిగే అదృష్టం నాకు లభించలేదు. ఆయన చిత్రాలంటే ఎంతో ఇష్టం. ముఖ్యంగా పోలీస్ పాత్రలు వేసిన చిత్రాల్లో ఒక్కోదానిని కనీసం పది సార్లు చూసివుంటాను. నడిగర్ సంఘం ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత ఆయనను కలుసుకున్నపుడు ఎంతో సంతోషంగా మాట్లాడారు. అదే ఆయన మా అందరితో బాగా మాట్లాడిన తరుణం. నడిగర్ సంఘంలో ఏదేని పెద్ద సమస్య ఉత్పన్నమైతే ఆయనను దృష్టికి తెచ్చుకుంటాం. నాయకుడు అంటే ముందుండి, క్షేత్రస్థాయిలో పనిచేసే లక్షణం కలిగివుండాలి. ఇలాంటి విషయాలు ఆయనను చూసి నేర్చుకున్నాం'అని హీరో కార్తీ పేర్కొన్నారు.నటుడు శివకుమార్ మాట్లాడుతూ, 'ముఖ్యమంత్రి కావాల్సిన వ్యక్తి ఇపుడు మనకు భౌతికంగా దూరం కావడం ఎంతో బాధగా ఉంది' అన్నారు.



విజయకాంత్ సమాధికి శివకుమార్ - కార్తీ నివాళులు

యూట్యూబ్ ఛానల్ ప్రారంభం, అప్‌లోడ్‌పై శిక్షణ

పెరంబూర్, జనవరి 4: యూట్యూబ్ ఛానల్ ప్రారంభం, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం తదితరాలపై మూడు రోజులు శిక్షణ అందించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామికాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 11వ తేది వరు ప్రతిరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నారు. యూట్యూబ్ ఛానల్ ప్రారంభం, వీడియోలు, సైడ్ షో తీయడం, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్, ఆన్‌లైన్ మార్కెటింగ్, లైక్‌లు పెంచుకోవడం తదితరాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణలో పాల్గొనేందుకు పేర్లు నమోదు తప్పనిసరి కాగా, శిక్షణ పూర్తయిన అనంతరం సర్టిఫికేట్లు అందజేశారు. మరిన్ని వివరాలకు www.editn.in అనే వెబ్‌సైట్, 044-22252081/82, 8668102699, 8668100181 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

పారాలింపియన్ క్రీడాకారిణికి సన్మానం



అడయార్, జనవరి 4: స్థానిక వెస్ట్ మాంబాళంలోని శ్రీదేవి ఆయుర్వేద ఫార్మాతో కలిసి నగరానికి చెందిన ఏఎల్4ఎస్ చారిటబుల్ ట్రస్ట్, కంచి మహా పెరియవ ఏఎల్4ఎస్ ఈవెంట్స్ సంయుక్తంగా 14 యేళ్ళ పారాలింపియన్ క్రీడాకారిణి షరోన్ రేచెల్ ఆబేను ఘనంగా సన్మానించారు. స్థానిక టీ నగరులోని ఇన్ఫోసిస్ హాలులో జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీదేవి ఫార్మా ఫౌండర్ ఎంగోపాల కృష్ణ పాల్గొని పారాలింపియన్‌ను ఘనంగా సన్మాంచి మెడల్‌తో పాటు ఇతర బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి ఫార్మా క్లినిక్ ఇన్‌చార్జ్ డాక్టర్ సెంథిల్ కుమార్ ఏఎల్4ఎస్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.అలాగే, ఈ మూడు సంస్థలు కలిసి మూడు రోజుల పాటు మార్గళి మాస సంగీతోత్సవాలను కూడా ఘనంగా నిర్వహించాయి. కాగా, శ్రీదేవి ఫార్మా క్లినిక్ చెన్నై వెస్ట్ మాంబాళంలోని నెంబరు 172, లేక్ వ్యూ రోడ్డులో ఉండగా, ప్రధాన కార్యాలయం కేరళ రాష్ట్రంలోని తిరువేంద్రం, కిలిమనూర్‌లో ఉంది.

అష్టమి సప్పరంలో ఊరేగిన మీనాక్షి, సుందరేశ్వరుడు



అష్టమి సప్పరం ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

చెన్నై, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మదురై మీనాక్షి అమ్మవారి ఆలయంలో అష్టమి సప్పరాల ఊరేగింపు వేడుకలు గురువారం ఉదయం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. మీనాక్షి అమ్మవారి ఆలయంలో ప్రతి నెలా ఉత్సవాలు జరుగుతుంటాయి. ఆ మేరకు మార్గశిర కృష్ణపక్ష అష్టమి సందర్భంగా మీనాక్షి అమ్మవారు, సుందరేశ్వరస్వామివారు సర్వాలంకరణశోభితులై సప్పరంలో ఆలయ ప్రధాన వీధులలో ఊరేగారు. ఈ వేడుకలను పురస్కరించుకుని వేకువజాము ఐదు గంటలకే ఆలయాన్ని తెరిచి మూలవర్లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకారాలు నిర్వహించారు. ఆ తర్వాత వృషభవాహనంలో మీనాక్షి సుందరేశ్వరర్‌లు ఊరేగారు. ఆ తర్వాత అందంగా అలంకరించిన పెద్ద సప్పరంలో ఆ ఆదిదంపతులు ఆశీనులై ప్రధాన వీధులలో ఊరేగారు.

జోరుగా బెల్లం తయారీ పనులు

అడయార్, జనవరి 4: సంక్రాంతి పండుగ కోసం నాటు బెల్లం తయారీ పనులు 25 గ్రామాల్లో జోరుగా సాగుతున్నాయి. తంజావూరు, తిరువారూరు, నాగపట్టణం, మైలాడుదురై జిల్లాల్లో వరి సాగు తర్వాత అత్యధికంగా చెరకు పంటను సాగుబడి చేస్తారు. దీంతో జిల్లాల్లోని గ్రామాల్లో నాటు బెల్లాన్ని తయారు చేస్తుంటారు. అయితే, ప్రతి యేటా సంక్రాంతి పండుగకు నాటు బెల్లం వినియోగం అధికంగా ఉంటుంది. దీనికితోడు, ప్రభుత్వం ఇచ్చే సంక్రాంతి కానుకల్లో ఒక కేజీ నాటు బెల్లంను కూడా ఇస్తుంది. ఈ యేడాది కూడా ప్రభుత్వం సంక్రాంతి కానుకలను పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తుంది. దీంతో నాటు బెల్లాన్ని అధిక మొత్తంలో తయారు చేయాలని ప్రభుత్వం నుంచి సూచన చేయడంతో ఈ నాలుగు జిల్లాల్లోని 25 గ్రామాల్లో ఈ బెల్లం తయారీ పనులు జోరుగా సాగుతున్నాయి.

కిలాంబాక్కం కొత్త బస్టాండులో మంత్రి తనిఖీలు

అడయార్, జనవరి 4: నగర శివారు ప్రాంతమైన కిలాంబాక్కంలో కొత్తగా నిర్మించి, ఇటీవలే ఉపయోగంలోకి తీసుకొచ్చిన కలైంజర్ సెంటనరీ బస్టాండును రాష్ట్ర మంత్రి పీకే శేఖర్‌బాబు గురువారం తనిఖీ చేశారు. ఈ బస్టాండుకు వెళ్ళే ప్రయాణికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నట్టు అనేక ఫిర్యాదులు వచ్చాయి. దీంతో మంత్రి శేఖర్‌బాబు గురువారం బస్టాండుకు వెళ్ళి తనిఖీలు చేశారు. ఆ తర్వాత ఆయన సీఎండీఏ, రవాణా శాఖ అధికారులతో ఒక సమీక్షా సమావేశం నిర్వహించి, బస్టాండులో ఉన్న లోటుపాట్లపై చర్చించారు. సుమారుగా రెండు గంటలకుపైగా బస్టాండు పరిసర ప్రాంతాల్లో కలియతిరుగుతూ అక్కడ నిర్మాణ పనులతోపాటు అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను కూడా ఆయన పరిశీలించి, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే, బస్టాండుకు ఎదురుగా నిర్మించనున్న రైల్వే స్టేషన్ స్థలాన్ని కూడా పరిశీలించారు. ఈ రైల్వేస్టేషన్ నిర్మాణ పనులను శరవేగంగా పూర్తి చేసి వచ్చే ఆగస్టు నాటికి అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.



రవాణా సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి శేఖర్‌బాబు



చెన్నై సచివాలయంలో గురువారం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్న సముద్రతీర భద్రతాదళం తూర్పుమండల కమాండింగ్ ఆఫీసర్ టోనీ మైఖేల్